క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ మెంబర్‌గా అష్రఫ్



నల్లగొండ టూటౌన్: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర మెంబర్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ అష్రఫ్ అహ్మద్‌ను నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రమేష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర మెంబర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కు అష్రఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో ఖేలో తెలంగాణ వరల్డ్ హిందూ లైన్స్ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ పోటీలను బీజేపీ ఓబీసీ సోషల్ మీడియా జాతీయ మెంబర్ పెరిక సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా, ఖేలో తెలంగాణ, జీతో నల్లగొండ అనే నినాదంతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని 16 టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌గౌడ్



మునుగోడు: తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మునుగోడు పట్టణానికి చెందిన మాదగోని నరేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జే. శ్రీధర్ బుధవారం నరేందర్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యరత్న పురస్కారాలు అందజేత



పురస్కారం అందుకుంటున్న అనితారాణి

నల్లగొండ టౌన్: ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్యరత్న పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఐఎంఏ నీలగిరి అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, కోశాధికారి డాక్టర్ ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ విశ్వజ్యోతి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కీర్తిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో జడ్జి నంద, పాండు రంగ శర్మ, డాక్టర్ అషిస్‌చౌదస్, రాఘవ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న యూసుఫ్‌బాబు

నల్లగొండ: చండూరు మండలంలోని దోనిపాముల గ్రామంలో సర్వే నంబర్ 123లో ప్రభుత్వ భూమిని కోడి గిరిబాబు అనే వ్యక్తి ఆక్రమించుకుని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టర్ హరిచందనకు చండూరు వాసి ఎండీ యూసుఫ్‌బాబా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో తహసీల్దార్, ఆర్డీఓ, అప్పటి కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వివరించారు.

పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న ఆర్.వాసు

చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్న మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్‌కు బుధవారం హైదరాబాద్‌లో బుక్ ఫెయిర్ ప్రధానకార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి 200 పుస్తకాలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందజేస్తున్న శ్రీనివాస్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అనుముల అక్షయ, ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నిర్మాణానికి శంకుస్థాపన

నల్లగొండ: పట్టణంలోని ఒకటో వార్డు పానగల్ చిలకల కాలనీలో అంగన్‌వాడీ పాఠశాల పునర్నిర్మాణ పనులకు బుధవారం పానగల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మోహన్‌బాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుండెగోని యాదయ్య, ఒర్సు రాములు, రుద్రాక్ష వెంకన్న, కొడదల ఆదినారాయణ, గుండగోని శ్రీను, ఆలకుంట్ల వెంకన్న, కుంచెం గిరి, రూపని రమేష్, ఆలకుంట్ల నాగరాజు, చారి, హేమలత పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు 'వేణుగోపాలుడు' ముస్తాబు

- నేటి నుంచి 29వ తేదీ వరకు శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఉత్సవాలు
- 24న స్వామివారి తిరుకల్యాణం

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రతి ఏటా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ముగింపు దశలో ఈ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనవాయితీ. పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం10 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

సుమారు 1800 సంవత్సరాల క్రితం..

ఆదిశేషుపడగ నీడన స్వయంభూగా వెలిసిన స్వామి వారి ప్రధానాలయంతోపాటు కొండపై గల ఇతర ఉపాలయాలు, ఆంజనేయస్వామి, మూలస్వామిగుట్ట, రామలింగేశ్వరస్వామి, ఆలయాలను తీరొక్క పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకించారు. ఈ ఆలయం గుట్ట సేద తీర్చుకుంటున్న ఆవు మాదిరి పోలి ఉండడంతో దీనిని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంగా పిలుస్తున్నట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. సుమారు 1800 సంవత్సరాల క్రితం మునుల తపస్శక్తి, ఉపాసన వల్ల స్వయంభూ స్వామి వెంచేశారని ప్రతీతి.

పుష్కరిణిలో సమృద్ధిగా నీరు..

అన్ని కాలాల్లో ఇక్కడి కోనేరులో నీరు సమృద్ధిగా ఉండడం విశేషం. దాని నిండా ఆకులు పరుచుకుని విరబూసిన తామర పూలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫ్లోరిన్ నీరు ఇక్కడి భూగర్భంలో ఉన్నప్పటికీ ఈ కోనేటి నీరు మాత్రం రుచికరంగా ఉండడం విశేషం.



శ్రీవారిజాల వేణుగోపాలస్వామి మూలవిరాట్

మంత్రిబావి నీరు పవిత్రం..

గుట్టపై మంత్రిబావి మూలస్వామి గుట్ట సమీపంలో ఉంది. ఈ బావిలోని నీటిని మహిమ గల నీరుగా భావిస్తారు. బావిలోని నీరు ఎక్కడి నుంచి వస్తుంది.. ఎక్కడికి పోతుంది అనేది అంతుబట్టని విషయం. ఈ నీటిని సేవించినట్లయితే మానసిక రుగ్మతులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. గతంలో సమీప రైతులు ఈ నీటిని తమ పంట పొలాలపై చల్లుకునేవారు.



గుట్టపై ఆలయ సమీపంలో కోనేరు

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు..

ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంతో శ్రీకారం చుట్టనున్నారు. 23న ధ్వజారోహణం, గరుడముద్ద, చాత్మర అంకురార్పణ, దేవతాహ్వానం, 24న శ్రీ స్వామివారి తిరుకల్యాణోత్సవం, హోమం, బలిహరణ, 25న గరుడ సేవ, బలిహరణం, 26న హనుమంతసేవ, 27న గోపలాయపల్లి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం, గుట్ట పైన రాత్రి రథోత్సవం, 28న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపోత్సవం. 29న శతకలశాభిషేకం, ధ్వజపట ఉద్వాసన, శ్రీ పుష్పయాగం, ఏకాంతసేవ, పవళింపుసేవలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. స్వామివారి తిరుకల్యాణోత్సవం, రథోత్సవం, దోపోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

ఆర్చీ ఎదుట ఆటోలు ఏర్పాటు చేశాం

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. తాగునీటి, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు నార్కట్‌పల్లి–చిట్యాల రహదారిలో ఆలయ ఆర్చీ ఎదుట ఆటోలు ఏర్పాటు చేశాం.

–అంబటి నాగిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి

ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



బ్రహ్మోత్సవాల కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 8 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పౌర్ణమి రోజు మాస కల్యాణం, హోమం నిర్వహిస్తున్నాం.

–కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: ఈ నెల 25న నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. బుధవారం తన నివాసంలో జాబ్ మేళా ప్రచార పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం, నకిరేకంటి నరేందర్, లింగాల వెంకన్న, యాసా కరుణాకర్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం స్వామి, కొండ వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నకిరేకల్‌లో నూతనంగా నిర్మించిన మేదరి సంఘం భవనాన్ని ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ రంగారెడ్డి

మర్రిగూడ: గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివన్నగూడలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఐతరాజు శ్రీను ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9 ఐబీ ఫుల్ బాటిళ్లు, 8 ఓసీ క్వాటర్లు, 90 ఎంఎల్ ఐబీ 9, ఓసీ 6 బాటిల్స్ లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, యాదయ్య, సైదులు, రమేష్, సతీష్, వాహిద్‌లు ఉన్నారు.

బెల్టు షాపుల నిర్మూలన కమిటీ ఎన్నిక

చండూరు : మండలంలోని ఉడుతలపల్లి, కోటయ్యగూడెం గ్రామాల్లో మాజీ సర్పంచులు కొరిమి అలివేలు ఓంకారం, మేకల వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీలు వేశారు. ఈ కమిటీలో 10మంది మహిళలు, 10మంది పురుషులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంట అనురాధ, సత్యం, కావలి ఆంజనేయులు, మండల కోఆప్షన్ మెంబర్ శుజావుద్దిన్, బంగారి గడ్డ ఎంపీటీసీ పల్లె వెంకన్న, లింగయ్య, సాపిడి రాములు, భూత రాజ్ ఆంజనేయులు, మేకల యాదయ్య, ఇరిగి రాజు, కదారి లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ గంట తులషయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కట్టంగూర్ : విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న యాత్రలో బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోమటి భాస్కర్, గుండు వెంకన్న, ఓరుగంటి హరిబాబు, బొడ్డుపల్లి అంజయ్య, సిద్దగోని మల్లికార్జున్, బత్తిని నాగరాజు, గున్నాల నాగరాజు, ఐతగోని శివ ఉన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయండి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ బాలయ్య

నకిరేకల్ : మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఇంటి, నల్లా పన్నుల వసూలు 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.బాలయ్య సిబ్బందిని ఆదేశించారు. నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత బుధవారం ఆయన తొలిసారిగా పట్టణ అభివృద్ధిపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023–24 వరకు ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్స్‌లు, పాత బకాయిలను తప్పనిసరిగా బిల్ కలెక్టర్లు వసూలు చేయాలని సూచించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఈ గౌతం, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

రామగిరి(నల్లగొండ): సీబీఎస్‌సీ ఎస్సెస్సీ హిందీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, విపస్య, కేవీఎస్, నార్కట్‌పల్లి శ్రీవిద్య పీఠ్ పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. హిందీ కోర్సు ఏ పరీక్షకు 28 మందికి 28, హిందీ కోర్సు బి పరీక్షకు 48 మందికి 48 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పద్య పఠనంతో మేధాశక్తి పెంపొందుతుంది



మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య

శాలిగౌరారం: పద్యపఠనం చేయడం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని, ప్రతి విద్యార్థి పద్యపఠనం చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఇన్‌చార్జ్ మండల విద్యాధికారి నాగయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మండలంలోని విద్యార్థులకు తెలుగు వికాస వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పద్యపఠనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు గోదావరి కళా దర్బార్ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ఏపీ బీసీ సంక్షేమ శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి వేణుగోపాలకృష్ణ

నల్లగొండ టౌన్ : సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న నల్లగొండ పట్టణానికి చెందిన డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ గోదావరి కళా దర్బార్–2024 జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీలోని రాజమహేంద్రవరంలో బుధవారం గోదావరి కళా దర్బార్ 2024 జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఏపీ బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ భరత్‌రాం, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కనగల్: రేగట్టె పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



చండూరు : తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాలలో..

కనగల్: మండల పరిధిలోని రేగట్టె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓ తరి రాములు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మీ , హెచ్‌ఎం పగిళ్ల సైదులు, ఉపాధ్యాయులు సంతోష, లిల్లీమేరి, పద్మ, శివన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మండలంలోని తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ..

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కేంద్రంలోని చిన్నారులు వివిధ శాఖల అధికారుల పాత్రలతో అలరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, వైద్యులు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శారద, ఆశా కార్యకర్తలు లపంగి కవిత, అలివేలు మంగ, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడ: రాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

నల్లగొండ : ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నల్లగొండ డివిజనల్ మేనేజర్ సుశీల్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. నల్లగొండ రివర్ నిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఎఫ్‌సీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరం సుమారు 100 మంది ఎఫ్‌సీఐ ఉద్యోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. రివర్ నిమ్స్ ఆసుపత్రి ప్రతినిధి వీరారెడ్డి, కేఎస్‌కే.ప్రసాద్, కేకే షా, విద్యాసాగర్, కృష్ణమూర్తి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీలో శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి, యాదాద్రి దేవస్థానాల వేద పండితుల ఆధ్వర్యంలో భూమి పూజ, విశ్వక్సేన, పుణ్యావాచనం, శిలన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో నీలగిరి కాలనీ, సూర్యవంశీ కాలనీ, కనకదుర్గ కాలనీ, రెడ్డి కాలనీ భక్తులు పాల్గొన్నారు.

తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలి

నల్లగొండ: విద్యార్థులను, ఉపాధ్యాయులను అయోమయానికి గురిచేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ టీఎస్ జిల్లా భవనంలో జరిగిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరిన నకిరేకల్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కోదాటి రాములుకు సభ్యత్వాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, చామల చంద్రశేఖర్, అంబటి అంజయ్య, బండ రమేష్‌రెడ్డి, యుగంధరాచారి, ఎడ్ల భిక్షం, మేకల జానారెడ్డి, సిలిగిరెడ్డి రామకృష్ణారెడ్డి, లగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లేఖానందం మృతికి సంతాపం

రామగిరి(నల్లగొండ): కవి, నాటకరంగ కళాకారుడు డాక్టర్ లేఖానందం మృతికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ధర్మానాయక్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం నల్లగొండలో లేఖానందం కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఖానందం అనేక సంవత్సరాలు నల్లగొండ అంబేద్కర్ రీజినల్ స్టడీ సెంటర్‌లో విద్యార్థులకు విద్యను బోధించారని గుర్తు చేశారు. లేఖానందం మృతి నల్లగొండ సాహిత్య రంగానికి తీరని లోటన్నారు. ఆయన వెంట పున్నమి అంజయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.

సేమ్ టు సేమ్

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఒకే రూపం కలిగిన పలువురు కవలలు ఉన్నారు. గురువారం కవలల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సేకరించిన ఆ కవలల ఫొటోలు మీకోసం. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ఒకే కుటుంబంలోని కవలలు
జైరాం–అభిరాం, ప్రేమ్ సిద్ధార్థ్– లక్ష్మీ అర్జున్



అస్మిత–సుస్మిత



రుగ్వేద్‌చారి–రోహిత్‌చారి



సాయిభార్గవి–సాయి కీర్తన



ఎలోనా–ఎలోరా



అన్విక– ఆద్విక



చరణ్–కిరణ్



హరిహరన్–హన్విక



ఆర్యన్–కార్తికేయన్



ఆద్వ–ఆన్వి



లవకుమార్–కుశకుమార్



మేనక–మేఘన



సాహితి–స్రవంతి



రిశాంత్–రోహన్



అమన్‌అలీ–రుమాన్ అలీ



సాయి సాత్విక్–సాయి రుత్విక్



వర్షిక– వర్తిక



కృతిన్‌రెడ్డి–కుందన్‌రెడ్డి